# బండి సంజయ్.. ఓ బ్లాక్‌మెయిలర్




టవర్‌సర్కిల్ వద్ద ప్రచారానికి హాజరైన ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- నాపై ఐటీ దాడులు చేయించిన దుర్మార్గుడు
- చందాల పేరుతో ఇబ్బంది పెడుతడు
- కాంగ్రెస్ అభ్యర్థికి టికెట్ ఇప్పించిండు
- నేను వ్యాపారులకు అండగా ఉంటా
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ హామీ

కార్పొరేషన్, నవంబర్ 24 : బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలు చేస్తున్నారని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అభ్యర్థికి టికెట్ ఇప్పించిందే ఆయన అని, ముస్లింల ఓట్లను చీల్చాలని ఇద్దరు కలిసి కుట్రలు పన్నారని దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 51, 13 డివిజన్లలోని టవర్‌సర్కిల్, రాంచంద్రాపూర్ కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నా భార్యా పిల్లలతో కలిసి నేను దుబాయ్ పోతే బండి సంజయ్ నా ఇంటిపై ఐటి దాడులు చేయించిన దుర్మార్గుడని విమర్శించారు. దీంతో తాను తెల్లారే తిరిగి రావాల్సి వచ్చిందని గుర్తు చేశారు. అధికార దుర్వినియోగం చేసి నా ఇంటి తాళం పగులగొట్టించి అరాచకం సృష్టించారని విమర్శించారు. స్మార్ట్‌సిటీ తెచ్చినట్టు చెప్పుకుంటున్న బండి సంజయ్ వేంకటేశ్వర దేవాలయంలో ప్రమాణం చేస్తావా? అని సవాల్ విసిరారు. స్మార్ట్‌సిటీ వచ్చినప్పుడు ఆయన కార్పొరేటర్‌గానే ఉన్నాడని గుర్తు చేశారు. హైదరాబాద్‌ను కాదని కరీంనగర్‌కు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఆ సమయంలో అప్పటి ఎంపీ వినోద్‌కుమార్, తాను, కార్పొరేటర్లతో ఢిల్లీకి వెళ్లి అప్పటి కేంద్ర మంత్రి వెంకయ్యానాయుడిని కలుసుకొని సాధించుకున్నట్లు చెప్పారు. అప్పుడు కూడా కార్పొరేటర్‌గా ఉండి కూడా ఢిల్లీ రాకుండా ముఖం చాటేసిన వ్యక్తి బండి సంజయ్ మండిపడ్డారు. స్మార్ట్‌సిటీని 2015లో సాధించుకొని పనులు చేపట్టామన్నారు. ఇప్పుడు స్మార్ట్‌సిటీ తాను తీసుకువచ్చానని దొంగ మాటలు చెబుతున్నారని విరుచుకుపడ్డారు. రెండు సార్లు తనపై పోటీ చేసి ఓడిపోయి 2019 ఎన్నికల్లో గుండె పోటు డ్రామాలు చేసి ఎంపీగా గెలిచాడని దుయ్యబట్టారు. తాను కరీంనగర్‌లో అభివృద్ధి చేసి వాటిని చెప్పి ఓట్లు అడుగుతున్నానని, మరి బండి సంజయ్ ఏం అభివృద్ధి చేసి ఓట్లు అడుగుతున్నాడో చెప్పాలన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత బండి ఎప్పుడైనా కనిపించాడా ? అని ప్రశ్నించారు. వారి పార్టీ అతడిని రాష్ట్ర అధ్యక్షుడిగా చేస్తే టికెట్‌ల దుకాణం పెట్టి అమ్ముకున్నాడని విమర్శించారు. పైసలు ఇవ్వలేదని బీసీ బిడ్డ తుల ఉమకు అన్యాయం చేశాడని మండిపడ్డారు. టికెట్లు అమ్ముకున్నాడని తెలిసే ఆ పార్టీ అధిష్ఠానం మెడలు పట్టి తోసిందని ఎద్దేవా చేశారు. వ్యాపారుల వద్ద తాము ఎప్పుడైనా డబ్బులు, చందాలు తీసుకున్నామా? అని అడిగారు. అదే బండి సంజయ్ గెలిస్తే చందాలతో ఇబ్బందులకు గురి చేస్తారని చెప్పారు. తాను ఎప్పటికీ వ్యాపారులకు అండగా నిలుస్తానని, తాను కూడా ఒక వ్యాపారినేనని, 35 ఏళ్లుగా గ్రానైట్ వ్యాపారాన్ని చట్టబద్ధంగా చేస్తున్నానని తెలిపారు. గత ఆరేళ్లుగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నానని, ఎవరినైనా రూపాయి అడిగానా? అని ప్రశ్నించారు. తాను దేవుడిని మనసులో పెట్టుకొని పూజిస్తే వాళ్ళు రాజకీయ స్వార్థం వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. గతంలో పైస్థాయి నాకులు వస్తే వ్యాపారుల నుంచి చందాలు వసూలు చేసే రోజులుండేవని, కేసీఆర్ పాలనలో బంద్‌లు లేకుండా పోయాయని, ప్రశాంత వాతావరణంలో వ్యాపారాలు చేసుకుంటున్నట్లు చెప్పారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చ లేకుండా బతికానన్నారు. మళ్లీ గెలిపిస్తే ఐదేళ్లు అభివృద్ధి వేగంగా సాగుతుందన్నారు. మొదలు పెట్టిన ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రపంచంలో గొప్ప నగరంగా కరీంనగర్ మారుతుందన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నయా పైసా తెచ్చానని దేవాలయంలో బండి సంజయ్ ప్రమాణం చేస్తాడా ? అని ప్రశ్నించారు. ఈసారి గెలిపిస్తే తాను కరీంనగర్‌కు మల్టీనేషనల్ కంపెనీలను తీసుకువచ్చి 10 వేల మందికి ఉపాధి కల్పించడాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని పని చేస్తానన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చేది లేదని, దానికి ఓటు వేసి వృథా చేసుకోవద్దని సూచించారు. వ్యాపారులు కష్టార్జితాన్ని చందాలుగా ఇవ్వొద్దని కోరారు. బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే మతఘర్షణలు వస్తాయని, తనను ఆశీర్వదిస్తే శాంతిభద్రతలు సక్రమంగా ఉండేలా చూస్తానన్నారు. తనను తిడితే ఓట్లు పడవని, ప్రజలకు ఏం చేశావో చెప్పి ఓట్లు అడగాలని బండి సంజయ్‌కు హితవుపలికారు. నగరంలో నిర్మించ తలపెట్టిన టీటీడీ, ఇస్కాన్ ఆలయాల నిర్మాణం కోసం కోటి రూపాయాలైనా తీసుకువచ్చే సత్తా ఉందా? అని ప్రశ్నించారు. బండి సంజయ్ హిందువు అయితే తాను హిందువును కాదా? అని నిలదీశారు. అన్ని మతాలను గౌరవిస్తామని, ప్రజలు అభివృద్ధి, శాంతిని కోరుకుంటారని పేర్కొన్నారు. లంచగొండులు, అవినీతి పరులకు ఓటు వేయద్దని కోరారు. ప్రచారంలో రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు చిట్టుమల్ల శ్రీనివాస్, వంగల పవన్, మునీందర్, ప్రేంకుమార్ ముందడా, ఏవీ రమణ పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలోనే తెలంగాణ సురక్షితం



మల్యాలలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

- కర్ణాటక నుంచి పెత్తనం చేసే కాంగ్రెసోళ్లు మనకు అవసరమా?
- రాష్ట్ర ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- మల్యాలలో చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ప్రచారం

మల్యాల, నవంబర్ 24: సీఎం కేసీఆర్ పాలనలోనే తెలంగాణ సురక్షితంగా ఉంటుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కర్ణాటక నుంచి పెత్తనం చేసే కాంగ్రెసోళ్లు మనకు అవసరమా? అని ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం మల్యాల మండల కేంద్రంలో ఎంఎల్సీ ఎల్గందుల రమణ, చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే విద్యుత్ సంక్షోభం తలెత్తుతుందని నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారని, అయితే నేడు సీఎం కేసీఆర్ మేధాశక్తితో విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు నెలకొల్పుకొని మిగులు విద్యుత్ రాష్ట్రంగా అడుగులు వేస్తున్నామన్నారు. ఎన్నికల్లో మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి సీఎంగా కేసీఆర్‌ను, చొప్పదండి ఎమ్మెల్యేగా రవిశంకర్‌ను గెలిపించాలన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ పాలనలోనే సురక్షితమని, కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ, మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ప్రజలందరూ కారు గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు. కొండగట్టు అంజన్న ఆలయాన్ని తిరుమల తరహాలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ పదేళ్లలో ప్రత్యేకంగా సాగునీటి ప్రాజెక్టుల వల్ల చొప్పదండి నియోజకవర్గం గణనీయంగా మారిందన్నారు. అనంతరం పలువురు బల్వంతాపూర్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, జడ్పీటీసీ కొండపలుకుల రామ్మోహన్‌రావు, ఎంపీపీ మిట్టపల్లి విమల, జడ్పీ కోఆప్షన్ సుభాన్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, సహకార సంఘాల అధ్యక్షులు ముత్యాల రాంలింగారెడ్డి, అయిల్నేని సాగర్‌రావు, బోయినపల్లి మధుసూదన్‌రావు, పార్టీ కార్యకర్తలు, కళాకారుల బృంద సభ్యులు పాల్గొన్నారు.



అల్గునూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# అభివృద్ధికి కేరాఫ్ అల్గునూర్

- కరీంనగర్‌కు స్వాగతతోరణంలా మారిన డివిజన్
- కాంగ్రెస్ నాయకులకూ కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశాం
- మానకొండూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్
- 8వ డివిజన్‌లో రోడ్డుషో.. భారీగా తరలివచ్చిన మహిళలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 24: కార్పొరేషన్‌లో విలీనం అయిన తర్వాత అల్గునూర్ అభివృద్ధికి చిరునామాగా మారిందని, ఒక వైపు కేబుల్ బ్రిడ్జి, మరోవైపు రివర్ ఫ్రంట్, తిమ్మాపూర్ వరకు నాలుగు వరుసల రోడ్డు, సెంట్రల్ లైటింగ్‌తో ధగధగా మెరిసిపోతూ కరీంనగర్‌కు స్వాగత తోరణంలా మారిందని బీఆర్ఎస్ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ అల్గునూర్‌లో రోడ్డుషోకు ఆయన హాజరయ్యారు. స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డివిజన్ మొత్తం పర్యటించారు. అనంతరం అల్గునూర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే రసమయి మాట్లాడారు. అప్పుడు ఎట్లుండే అల్గునూర్, ఇప్పుడు ఎట్లా మారిందో స్థానికులు గమనించాలన్నారు. కార్పొరేషన్‌లో విలీనమైన తర్వాత ఇక్కడ భూములకు డిమాండ్ చాలా పెరిగిందని గుర్తు చేశారు. షోరూంలు, ఫుడ్ కోర్టులు అనేకం వచ్చాయని, రానున్న రోజుల్లో రివర్ ఫ్రంట్ పూర్తయితే ఇక్కడ అభివృద్ధి కనీవినీ ఎరుగని రీతిలో ఉంటుందని పేర్కొన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పుకొంటూ వస్తున్న కాంగ్రెస్ నాయకులను నమ్మవద్దని సూచించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని, ఇదే క్రమంలో ఇక్కడి కాంగ్రెస్ నాయకులకూ కల్యాణలక్ష్మి, షాదీముబారఖ్ చెక్కులు అందజేశామని, అదీ ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్పతనమని కొనియాడారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్, పొరండ్ల సింగిల్ విండో చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి మాట్లాడుతూ, అల్గునూర్ అభివృద్ధికి మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో పాటు, ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టుబడి ఉన్నారని చెప్పారు. స్థానికంగా జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ సల్ల శారదారవీందర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జాప శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించగా, నాయకులు కంది రాంచంద్రారెడ్డి, కంది అశోక్ రెడ్డి, పడాల రమేశ్, చిందం మల్లేశం, అంజయ్య, కమలాకర్, సల్ల మహేందర్, లక్ష్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, దీపక్, దిలీప్, రాజమల్లు, శ్రీకాంత్, చంద్రయ్య, అనంత రెడ్డి, అఫ్రోజ్, హాజార్, నవీద్, ఫయాజ్, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు చిల్లా పరశురాం, జీకే యూత్ డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్, రవి, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కారుగుర్తుకు ఓటేయాలని వృద్ధులను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

# దివ్యాంగులను ఆదుకున్నది కేసీఆరే

- హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, నవంబర్ 24: స్వరాష్ట్రంలో దివ్యాంగులు, వృద్ధులను ఆదుకున్నది ముఖ్యమంత్రి కేసీఆరేనని బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కమలాపూర్‌లో దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. అరవై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ దివ్యాంగులు, వృద్ధులను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన కేసీఆర్ దివ్యాంగులకు రూ.3వేలు, వృద్ధులకు రూ.2వేలు పెన్షన్ ఇచ్చి కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నారని కొనియాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వృద్ధులు, దివ్యాంగులకు తాను కూడా అండగా ఉంటానని తెలిపారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్‌ను వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలకు దశలవారీగా పెంచుతామన్నారు. రూ.4 వందలకే గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మి పేరుతో మహిళలకు రూ.3వేలు అందిస్తామని వెల్లడించారు. కేసీఆర్ ధీమా ఇంటింటికీ బీమా పథకం ప్రవేశ పెట్టి మరణించిన వ్యక్తుల కుటుంబాలకు రూ.5లక్షలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, దివ్యాంగుల నాయకులు సంపత్, జనార్దన్, శ్రీనివాస్, వృద్ధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.